సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ఆరోగ్యం.. ఆదర్శం

- మా వాకర్స్ క్లబ్ ఆశయం
- సేవా కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం


మా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: నాది.. నీది, వారిది.. వీరిది అనే పదాలు మనుషుల మధ్య దూరాలు పెంచుతాయి. దీని ఫలితంగా మానవ సంబంధాలు దెబ్బతింటాయి. అలా కాకుండా మనం.. మనది, మనవారు.. అందరం అనే మాటలు మానవీయతను చాటుతాయి. అందుకే మురళీనగర్ పరిసరాలకు చెందిన కొందరు వాకర్స్ తమ క్లబ్‌కు మా వాకర్స్ క్లబ్‌గా నామకరణం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆలోచనల నుంచి పుట్టిందే ఈ 'మా వాకర్స్ క్లబ్'. మనందరి ఆరోగ్యంతోపాటు మనం అందరికీ ఆదర్శంగా ఉండా మనే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

2012లో ఏర్పాటు

స్నేహితులందరూ కలిసి 2012లో ఏర్పాటు చేసిన మా వాకర్స్ క్లబ్‌ను 2018లో రిజిస్టర్ చేశారు. సుమారు 50 మంది సభ్యులు ఉన్న ఈ క్లబ్‌లో చేరాలంటే తప్పనిసరిగా వాకర్ అయి ఉండాలి. గ్రూప్ సభ్యులతో మంచి సుహృద్భావ సంబంధం కలిగి ఉండాలి. మనం అనే ఆప్యాయత, అనురాగాలు పంచాలి. నిస్వార్థంగా సమాజం కోసం పని చేయాలి. ఆరోగ్యంగా ఉంటూ అందరికీ ఆదర్శంగా నడుచుకోవాలి. మనం సమాజం కోసం పనిచేయాలి. వయసుతో నిమిత్తం లేకుండా చేరవచ్చు. అందరం కలిసి ఉండాలి అనే నిబంధనలు పాటించాలి.

ఇవీ సేవా కార్యక్రమాలు : మా వాకర్స్ క్లబ్ ఏర్పాటైన నాటి నుంచి సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అనాథాశ్రమ పిల్లలకు భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రధాన పండగల్లో అనాథాశ్రమ పిల్లలతో గడుపుతారు. క్లబ్ సభ్యుల పుట్టిన రోజు వేడుకలను పిల్లలతో కలిసి జరుపుకుంటారు. దీపావళి, దసరా, సంక్రాంతి సమయాల్లో పిండి వంటలు తయారు చేసి వారికి ఇస్తారు. నెలలో ప్రతి మొదటి ఆదివారం బీచ్ రోడ్ క్లీనింగ్ నిర్వహిస్తారు. మూగ జీవాలకు ఆహారం అందజేస్తారు. కరోనా విపత్తు సమయంలో వందలాది మూగజీవాలకు ఆహారం అందించి ఆదుకున్నారు. సభ్యుల్లో ఎవరికి కష్టం వచ్చినా ఆర్థిక సాయం చేసి, వారి ఇళ్లలో జరిగే శుభకార్యాలకు వెళ్లి తమ వంతు సహకారం అందిస్తారు. ఏడాదికోసారి పిక్నిక్‌లు నిర్వహిస్తారు.

ఒకే చోట.. టీ టైమ్

ప్రతి రోజు మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ వద్ద క్లబ్ సభ్యులంతా కలిసి తేనీరు తాగుతారు. ప్రతి శనివారం, ఆదివారం ఏకరూప దుస్తులు ధరించాలి అనే నిబంధన కచ్చితంగా పాటిస్తారు. అందరూ ఒకే చోట కలిసి ఆత్మీయానురాగాలు పంచుకుంటారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటారు. క్లబ్ సభ్యుల్లో ఒకరికి ప్రతి నెలా రేషన్ అందిస్తున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఒకరికి మందుల కోసం రూ.70 వేలు సాయం చేశారు.

సామాజిక చైతన్య కార్యక్రమాలు

మన నగరం–మన బాధ్యత అంటూ క్లబ్ సభ్యులు పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధంపై చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధి నివారణ చర్యలపై అవగాహన ర్యాలీలు, ప్రతి నెలా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమం, వాల్తేరు రైల్వే జోన్ సాధనకు ఉద్యమం చేశారు.

అందరి కోసం పనిచేస్తున్నాం



మా వాకర్స్ క్లబ్ ఆప్యాయతకు మారుపేరుగా నిలుస్తోంది. క్రమశిక్షణకు అధిక ప్రాధాన్యమిస్తాం. ఆపదలో ఉన్న తోటివారిని ఆదుకోవడం మానవ ధర్మంగా మేము పాటిస్తాం. అందరం కలిసి ప్రతి ఒక్కరి ఆరోగ్యం, ఆనందం కోసం పనిచేస్తున్నాం. సభ్యులు సంపూర్ణ సహకారంతో క్లబ్ విజయవంతంగా నిర్వహిస్తున్నాం.

– పల్లా చంద్రమౌళి,
క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు

సేవా కార్యక్రమాలు విస్తృతం



మా వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాం. ఇకపై నెలకోసారి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాం. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తాం. ఆరోగ్య పరిరక్షణకు ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– అన్నెపు దామోదర్,
క్లబ్ ప్రస్తుత అధ్యక్షుడు

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'


వినతిపత్రం స్వీకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో సోమవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజల తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయన వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్ని అర్జీలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిన సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'స్పందన'కు 24 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 24 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికృష్ణ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోన్‌–5కు 8 వినతులు


సమస్యలు తెలుసుకుంటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్‌–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 01, పబ్లిక్ హెల్త్‌కు 01, యూసీడీకి 01, రెవెన్యూ విభాగానికి 05 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాస్‌రావు, టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరత్‌కుమార్, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, సీడీవో పద్మావతి పాల్గొన్నారు.

రైల్వే వైద్యులపై ఆరోపణలు అవాస్తవం

రైల్వే సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి

తాటిచెట్లపాలెం: రైల్వే వైద్యులపై ఇటీవల వస్తున్న తప్పుడు ఆరోపణల్లో వాస్తవం లేదని ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైల్వే డివిజనల్ ఆస్పత్రి సీనియర్ వైద్యులపై బదిలీ అయిన వైద్యుడు తప్పుడు ఆరోపణలతో కేసులను పెట్టి తమ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదే వ్యక్తిపై గతంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జోనల్ రైల్వే పాలనా కేంద్రం వేరే డివిజన్‌కు బదిలీ చేసిందన్నారు. బదిలీ విషయం తెలుసుకున్న సదరు వైద్యుడు తొలుత అనారోగ్యంతో ఉన్నట్లు తప్పుడు సమాచారం అందించారని, ఉన్నతాధికారులు నిజాలు తెలుసుకుని నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. దీంతో అతను కటక్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ నుంచి తాత్కాలిక స్టే తెచ్చుకున్నట్టు తెలిసిందన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో పనిచేసి, సస్పెండైన ఓ ఉద్యోగి సాయంతో మీడియా ముందుకు వచ్చి ఎస్సీ, ఎస్టీలపై రైల్వే అధికారులు వేధింపులు చేస్తున్నారని చెప్పడం ఆక్షేపణీయమన్నారు. విధుల నుంచి వేటు పడిన వారు చేసే తప్పుడు ఆరోపణలపై చర్యలుంటాయన్నారు. అవినీతి, బ్లాక్‌మెయిల్, తప్పుడు ప్రవర్తనపై న్యాయపరమైన చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

పదవీ వ్యామోహంతో విశాఖపై విషం


మాట్లాడుతున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

- పరిపాలన రాజధానికి గతంలో అనుకూలంగా మాట్లాడారు కదా..
- ఉత్తరాంధ్ర ప్రజలకు విష్ణుకుమార్‌రాజు తక్షణం క్షమాపణ చెప్పాలి
- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు డిమాండ్

సీతమ్మధార: పదవీ వ్యామోహంతో విశాఖపై మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు విషం చిమ్ముతున్నారని, తక్షణం ఉత్తరాంధ్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు డిమాండ్ చేశారు. విశాఖ కేంద్రంగా పరిపాలన రాజధాని ఏర్పాటుపై విష్ణుకుమార్‌రాజు వ్యతిరేకంగా మాట్లాడడాన్ని తప్పుపట్టారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు కుట్రలో విష్ణుకుమార్‌రాజు భాగమయ్యారని, అందులో భాగంగానే టీడీపీ సీటు కోసం విశాఖపై విషం చిమ్ముతున్నారని ధ్వజమెత్తారు. పదవి కోసం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలు దెబ్బతినేలా దిగజారి మాట్లాడతారని అనుకోలేదన్నారు. పరిపాలన రాజధానికి విశాఖ అన్ని విధాలా అనుకూలమని గతంలో మీడియా సమావేశంలో విష్ణుకుమార్‌రాజు మాట్లాడారని గుర్తుచేశారు. ఇప్పుడు మాట మార్చడం దేనికి సంకేతమన్నారు.

అర్హులందరికీ పథకాలు అందిస్తున్నాం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే.. చంద్రబాబు అండ్ కంపెనీ విష ప్రచారం చేస్తోందని కె.కె.రాజు దుయ్యబట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై హేళనగా మాట్లాడిన విష్ణుకుమార్‌రాజుకు సవాల్ విసురుతున్నానని, దమ్ము, ధైర్యం ఉంటే క్లస్టర్, సచివాలయం, వార్డు పరిధిలో ఎక్కడ మోసాలు జరిగాయో నిరూపించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోక్, అల్లు శంకరరావు, స్టాండింగ్ మెంబర్ సారిపల్లి గోవింద్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, శశికళ, కంటిపాము కామేశ్వరి, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

పాలిసెట్ మోడల్ పరీక్షకు విశేష స్పందన


మోడల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో గత నెల 17 నుంచి నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత కోచింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు సోమవారం పాలిసెట్ మోడల్ పరీక్ష నిర్వహించారు. దీనికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శిక్షణ పొందిన రెండు బ్యాచీలకు చెందిన వారు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు పర్యవేక్షించారు.

పుస్తకమే మన నేస్తం


విద్యార్థులకు సూచనలిస్తున్న శంకరరావు

మురళీనగర్: పుస్తకాన్ని మించిన మంచి నేస్తం మరొకటి లేదని గణిత ఉపాధ్యాయుడు ఎం.శంకరరావు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భయం వీడితే గణిత భావనలను నేర్చుకోవడం చాలా సులువని చెప్పారు. విద్యార్థులతో కథలు చెప్పించారు. ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. విద్యార్థులు చదివిన కథల నుంచి కొన్ని ప్రశ్నలను అడిగి ఆయన సమాధానాలు రాబట్టారు. కొందరు విద్యార్థులు ఇన్ డోర్ గేమ్స్ ఆడారు. గ్రంథాలయ అధికారి వై.పద్మజ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యుడు జామి అన్నాజి, లక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్ దుర్గమ్మ పాల్గొన్నారు.

తరల్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థుల్లో బేసిక్ విషయాలపై అవగాహన పెంపొందించేలా తరల్ పుస్తకాలను పంపిణీ చేశారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సోమవారం వాటిని ఉపాధ్యాయులు అందించారు. 164 మందికి పుస్తకాలు ఇస్తున్నామని, సెలవుల్లో పుస్తకంలో ఇచ్చిన అన్ని యాక్టివిటీస్ పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మ్యాథ్స్, తెలుగు, డ్రాయింగ్, పొడుపు కథలు, బొమ్మలతో సామెతలు, పద సంపద, మైండ్ మ్యాప్, మన ఆలోచన–మన కథ, ప్లే విత్ నంబర్స్, కూడికలు, తీసివేతలు, థింక్ అండ్ అండర్ స్టాండ్ ఇలా పలు రకాల యాక్టివిటీలు తరల్ పుస్తకంలో పొందుపర్చారు. సెలవుల్లో వీటిని పూర్తి చేయడం వల్ల ఉపాధ్యాయులకు బోధన సులవుతుందన్నారు. ఏమైనా సందేహాలుంటే విద్యార్థులు తమకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు.

12 నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ

సీతమ్మధార: వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి ఐదు రోజుల పాటు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఉంటుందని చెప్పారు. 14 నుంచి 40 ఏళ్ల వయసు గల అమ్మాయిలు, మహిళలు వర్క్‌షాప్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 85200 04288 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దళిత అధికారులపై వేధింపులు తగవు


మాట్లాడుతున్న భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ

సీతంపేట: దళిత అధికారులపై జరుగుతున్న అట్రాసిటీలను తీవ్రంగా ఖండిస్తున్నామని భీమ్‌సేన ప్రధాన కార్యదర్శి రవి సిద్ధార్థ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా రాష్ట్రంలో దళిత అధికారులు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఆత్మగౌరవంతో విధులు నిర్వహిస్తున్న అధికారులు దళితులైతే వారిపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో డాక్టర్ అచ్చెన్న హత్య నుంచి జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రాజాబాబు వరకు అనేక మంది అట్రాసిటీకి గురయ్యారని చెప్పారు. జీ20 సదస్సు విజయవంతంగా నిర్వహించి ప్రపంచ దేశాల ప్రతినిధులచే మన్ననలు పొందినప్పటికీ రాజాబాబుపై అసత్య ఆరోపణలు చేయడానికి ప్రధాన కారణం దళితుడు కావడమే అన్నారు. జీవీఎంసీలో సూపరెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అధికారి దళితుడు అవ్వడం వల్ల ఆయనపై అసత్య ఆరోపణలతో దుష్ప్రచారం జరుగుతోందన్నారు. విశాఖ రైల్వే ఆస్పత్రిలో పనిచేస్తున్న దళిత డాక్టర్‌పై అక్కడున్న సహచర ఆధిపత్య కులాల డాక్టర్లు దాడులు చేశారని ఆరోపించారు. ఇటువంటి ఘటనలపై ప్రభుత్వాలు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో భీమ్‌సేన ప్రతినిధులు ఓంకార్, జగదీష్, శ్రీకాంత్, జైకుమార్, రావణ్, రాము, శ్రీను, సర్వేశ్వరరావు, అప్పలరాజు, ఉత్తరాంధ్రా దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శంకరరావు నాయుడు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని హరగోపాల్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ(విజయవాడ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా నేషనల్ లెవెల్ పెయింటింగ్ కాంపిటీషన్స్ 2022–23 పోటీలకు 50 మంది హరగోపాల్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో ఎన్.నేహ(6వ తరగతి), ఎం.డి.నిజాముద్దీన్ షఫీ(6వ తరగతి), ఆర్.భవ్యశ్రీ(7వ తరగతి) స్వర్ణ పతకాలు సాధించారు. ఎస్.కె.గుల్షియా(7వ తరగతి), కె.చేతన్(7వ తరగతి)లకు వెండి పతకాలు దక్కాయి. మిగిలిన 45 మందికి మెరిట్ సర్టిఫికెట్లు లభించినట్లు స్కూల్ హెచ్ఎం టి.శంకరరావు నాయుడు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ టి.కనకమహాలక్ష్మి, డ్రాయింగ్ టీచర్ డి.సుమన్‌ల ప్రోత్సాహంతో బహుమతులు గెలుచుకున్నామని విజేతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

సంకీర్తన పోటీల విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య సంకీర్తన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. అన్నమాచార్య 615వ జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఈ పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. సోమవారం సాయంత్రం పౌర గ్రంథాలయంలో బహుమతుల ప్రదానోత్సవాన్ని సింహాచలం దేవస్థానం పురోహితుడు కరి సీతారామాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలతో వేంకటేశ్వర స్వామి వారి పరిపూర్ణ కటాక్షం లభిస్తుందన్నారు. ముఖ్య అతిథి ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే భక్తిని అలవర్చుకోవాలన్నారు. సంగీత కళలో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించే దిశగా అన్నమాచార్య జయంతిని నిర్వహించిన శృతిలయ సంస్థ ప్రతినిధులను అభినందించారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

విజేతలు వీరే..

సబ్ జూనియర్స్ విభాగంలో రితిక మహాదేవ్, ఇంద్ర మహిత్, ఆకాంక్షవల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. జూనియర్స్ విభాగంలో హరిణి, నిరత్యయ, సాయి శ్రావణి.. సీనియర్స్ విభాగంలో పి.శారద, నాగలక్ష్మి, లక్ష్మీప్రియాంక మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు, భీమిలి నియోజకవర్గ పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. సత్యసాయినగర్, వరాహగిరి ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకుతో కలిసి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ పనుల నిమిత్తం రూ.20 లక్షల నిధులు మంజూరైనట్లు జీవీఎంసీ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, ఎల్.రవిశంకర్, కె.కనకరాజు, వాసుపల్లి యల్లాజీరావు, మడక పైడిబాబు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సామాజిక భవనం ప్రారంభం

వార్డులోని సింగాలమ్మపురంలో రూ.26.50 లక్షల జీవీఎంసీ నిధులతో పునర్నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కంపా హనోకులు కాలనీ అధ్యక్షుడు చింతల బాబూరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏఈ రమణమ్మ, సీవో లక్ష్మి, పార్టీ నాయకులు సన్యాసప్పల నాయుడు, నేపాల్ శ్రీను, సన్ని, నానిబాబు, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

సింగాలమ్మపురంలో 'గడప గడపకు..'

సింగాలమ్మపురంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

మురళీనగర్: మండుటెండలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు సోమవారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ సభ్యురాలి ఆర్థిక సాయంతో బిర్లా కూడలిలో 100 మంది పాదచారులకు మజ్జిగ ప్యాకెట్లు అందించారు. క్లబ్ కార్యదర్శి సనపల పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి బి.జయలక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు


51వ వార్డులో అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

మద్రిపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 51వ వార్డు 291 సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాధవధార కళింగనగర్, వుడా క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి వివరించి నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయనను మళ్లీ ఆశీర్వదించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పైడి శ్రీను, దిడ్డి రమేష్, రాయుడు శ్రీను, నూకరాజు, ఐ.రవికుమార్, పార్టీ 51వ వార్డు నాయకులు తిరుమలరావు, రత్నం, మెట్ట దమయంతి, వరలక్ష్మి, రాణి, రామ్‌మోహన్‌రావు, కె.అప్పారావు, త్రినాథ్, పి.లక్ష్మణ్, కృపా, శ్యామ్, గణేష్, ఎం.సునీల్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్న, చిరంజీవి, బి.విజయ్, వసంతల అప్పారావు, రాఘవులు, గురువోజి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమాంబ తొలేళ్ల సంబరం



కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం దుర్గానగర్ వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీరామా సేవా సమాజం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అమ్మవారి తొలి ప్రతిమకు పూజలు చేసి యాత్రను ప్రారంభించారు. సుమారు 65 అమ్మవారి ప్రతిమలను దొండపర్తి, జగదాంబ, అల్లిపురం, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులపేట మీదుగా ఊరేగించి కంచరపాలెంలోని సీతారామాలయం, సంపత్ వేంకటేశ్వరాలయం, ధనలక్ష్మి ఆలయాల ఆవరణలో నిలిపారు. అనంతరం తోటవీధిలోని పుట్ట బంగారం వద్దకు చేర్చారు. తొలేళ్ల ఉత్సవంలో నేలవేషధారణలు ఆకట్టుకున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. మంగళవారం ప్రధాన జాతరనిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా


మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌లో స్కూటీని పరిశీలిస్తున్న క్రైం సీఐ దుర్గాప్రసాద్

మద్రిపాలెం: నేర నియంత్రణలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘాతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. 53వ వార్డు మద్రిపాలెం రైల్వే క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో సోమవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులను ఆయన ప్రశ్నించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించిన నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాటిని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు విలువైన వస్తువులను, నగదును బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, ఆయా ప్రాంతాల్లో పోలీసుల నిఘా పెంచుతామని చెప్పారు. అనుమానితులు తమ ప్రాంతాల్లో సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్పెషల్ డ్రైవ్‌లో క్రైం ఎస్ఐలు కాంతారావు, ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com